సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 26 । మార్చి । 2023

ప్రేమ విఫలమైందని..



ప్రేమ విఫలమైందని మనస్తాపానికి గురైన ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోలారం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది.


8లో ▸

టీ, టిఫిన్ సెంటర్లపై కేసులు

సాక్షి, సిటీబ్యూరో: వసతి గృహాలు, టీ, టిఫిన్ సెంటర్లపై పౌర సరఫరాల శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. శనివారం ఆకస్మిక దాడులు చేసి వాణిజ్య సిలిండర్లు బదులు గృహ సంబంధ సిలిండర్ల వినియోగంపై 101 కేసులు నమోదు చేశారు. సుమారు 245 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. 34 జీపీసీఎల్, 120 హెచ్‌పీసీఎల్, 91 ఐఓసీఎల్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారిణి తెలిపారు.

ఓయూలో ముగిసిన సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ, డీఆర్‌డీఓ, ఇస్రో ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఐఎస్ఎస్ఈ ఆధ్వర్యంలో సిస్టమ్ అప్రోచ్ ఫర్ సెల్ఫ్ రిలయోన్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (ఎస్ఎఎస్‌టీ-2023) అంశంపై జరిగిన సదస్సులో పలువురు సైంటిస్టులు వివిధ అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పించారు.





సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి, మంత్రి సబితారెడ్డి తదితరులు



సభకు హాజరైన జనం



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

పథకాల ఘనత మాదే

- దేశానికే పాఠాలు చెప్పే స్థాయిలో తెలంగాణ
- రాష్ట్రంలో కేసీఆర్ పథకాలు చేరని ఇల్లు లేదు
- అభివృద్ధిలో దూసుకుపోతున్న ఇబ్రహీంపట్నం
- పరిశ్రమల స్థాపనతో వేలాది మందికి ఉపాధి
- ప్రగతి నివేదన యాత్ర ముగింపు సభలో మంత్రి కేటీఆర్

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన వాడే నిజమైన నాయకుడని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చేరని ఇల్లు లేదని, తొమ్మిదేళ్లలో ఊహించని రీతిలో అభివృద్ధి సాధించామన్నారు. ప్రస్తుతం తెలంగాణ దేశానికే పాఠాలు చెప్పే స్థాయికి చేరుకుందన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తనయుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన యాత్ర శనివారం ముగింపు సందర్భంగా పెద్ద అంబర్‌పేటలోని ఔటర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్న సంకల్పంతో పాదయాత్ర చేపట్టి నియోజకవర్గ ప్రజల్లో స్థానాన్ని సంపాదించిన మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి పట్టుదల అభినందనీయమని పేర్కొన్నారు. ఈ యాత్రలో పది సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని, వాటిని ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని, యువతకు ఉపాధి కల్పించేందుకు వీలుగా అనేక పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. కొంగరలో 200 ఎకరాల విస్తీర్ణంలో ఫాక్స్‌కాన్ పరిశ్రమ ఏర్పాటు కానుందని, లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

లీకేజీలతో సంబంధం లేదు

పొరపాట్లు జరగడం సహజమేనని, చిన్న తప్పులను పెద్దగా చేసి ప్రభుత్వంపై విపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీలో లీకేజీలు జరిగిన మాట వాస్తవమేనని, దీంతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తప్పిదాలను గుర్తించి, మళ్లీ పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో పరీక్షలను రద్దు చేసినట్లు గుర్తు చేశారు.

రూ. 2,400కోట్లతో అభివృద్ధి

నియోజకవర్గ అభివృద్ధికి రూ.2,400 కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.10కోట్ల చొప్పున కేటాయించాలని కేటీఆర్‌ను కోరారు. పెద్దఅంబర్‌పేట-పసుమాముల రోడ్డు విస్తరణ, మూసీ ట్రంక్ లైన్‌నిర్మాణం, బండరావిరాల మైనింగ్‌జోన్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుతో పాటు యాచారం ఫార్మాసిటీ, కొహెడాలో పండ్ల మార్కెట్, మంచాలలో ఐటీ పార్కుల నిర్మాణానికి దృష్టి సారించాలని కోరారు.

ప్రజాసేవకే జీవితం అంకితం

'పదవులున్నా .. లేకపోయినా ప్రజాసేవకే నా జీవితాన్ని అంకితం చేస్తా' అంటూ బీఆర్ఎస్ నేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. 63 రోజుల పాటు ప్రజల్లోనే ఉన్న తనను ప్రతి ఒక్కరూ సొంత బిడ్డలా ఆదరించారని భావోద్వేగానికి గురయ్యారు. ప్రగతి నివేదన యాత్రలో తన దృష్టికి వచ్చిన సమస్యలను కేటీఆర్ ద్వారా పరిష్కారం అయ్యేలా కృషి చేసి, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానన్నారు. సభలో మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, రైతుబంధు జిల్లా కోఆర్డినేటర్ వంగేటి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, దాసోజు శ్రావణ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

బీఆర్ఎస్ నేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన యాత్ర ముగింపు సందర్భంగా పెద్దఅంబర్‌పేటలో నిర్వహించిన సభ విజయవంతమైంది. సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. సభ ప్రారంభం కాగానే కళాకారులతో ధూంధాం కార్యక్రమాన్ని నిర్వహించగా, గాయకుడు సాయిచంద్ పాటలు సభికుల్లో జోష్ నింపాయి.

న్యూస్‌రీల్

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు



బడంగ్‌పేట్: వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. కార్పొరేషన్ పరిధి గుర్రంగూడలోని టీచర్స్ కాలనీ ప్రకృతి ఆవాస్ అపార్ట్‌మెంట్ సమీపం నుంచి శనివారం ఉదయం ఓ బాలుడు (4) నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కల గుంపు దాడి చేసింది. బాలుడికి తీవ్రగాయాలు కావడంతో దగ్గరలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీధికుక్కలను అరికట్టాలని విజ్ఞాపనలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



తుక్కుగూడ: క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఎల్‌బీనగర్‌లోని కామినేని వైద్య కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 510 మంది టీబీ బాధితులకు అభయ ఫౌండేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, టీబీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్స్‌ను పంపిణీ చేసినట్లు చెప్పారు. 5,620 టీబీ కేసులను గుర్తించాల్సి ఉండగా 5,089 గుర్తించినట్టు తెలిపారు. ఇది ప్రాణాంతక వ్యాధి కాదని సంపూర్ణ చికిత్స, పౌష్టికాహారంతో నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



శిబిరంలో పాల్గొన్న హైకోర్టు జస్టిస్ నంద, సినీ నటుడు సుమన్ తదితరులు

మీర్‌పేట: ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హైకోర్టు జస్టిస్ సూరేపల్లి నంద సూచించారు. బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మీర్‌పేట గాయత్రీనగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం సినీ నటుడు సుమన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నంద మాట్లాడుతూ.. ఆరోగ్యం అందరికీ ఎంతో ముఖ్యమని, ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ.. కరోనా లాక్‌డౌన్ కష్టకాలంలో వైద్యులు, పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలు మరువలేనివని గుర్తు చేశారు. శిబిరంలో సుమారు 400 మందికి 17 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక నాయకుడు అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో కేర్ హాస్పిటల్స్ మేనేజర్ టి.సాయికిరణ్, న్యూగాయత్రీనగర్ కాలనీ ప్రతినిధులు ప్రభాకర్‌రావు, కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం తప్పదు



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- రాహుల్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కుట్రలు
- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి

షాద్‌నగర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేక బీజేపీ కుట్రలు పన్నుతోందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ శనివారం షాద్‌నగర్ పట్టణంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి, ముఖ్య కూడలిలో దహనం చేశారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ.. భారత్‌జోడో యాత్రతో దేశంలోని అన్ని వర్గాలు, ప్రజలకు రాహుల్ గాంధీ దగ్గరయ్యారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే తప్పుడు సాక్ష్యాలతో కక్షసాధింపు చర్యలకు పాల్పడిందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్, నాయకులు జంగ నర్సింహ, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఖదీర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి

గవర్నర్ తమిళిసై



మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై

శంకర్‌పల్లి: మహిళా సాధికారితతోనే దేశ అభివృద్ధి సాధ్యమని, మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని గవర్నర్ తమిళిసై అన్నారు. దొంతాన్‌పల్లి గ్రామ శివారులోని ఇక్ఫాయ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే మహిళా ఐక్యత సంఘర్షణలు-సంక్షిప్తనలు అంశంపై నిర్వహించిన సదస్సును ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలని సూచించారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు.. నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. మరింత అభివృద్ధి దిశగా సాగాలన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో విధులు నిర్వర్తించడం గర్వకారణమన్నారు. తాము ఎవరికీ తక్కువ కాదని.. మనోధైర్యాన్ని పెంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డెలినా ఖాంగ్డప్, ఇక్ఫాయ్ కళాశాల వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎల్.ఎస్.గణేశ్, డైరెక్టర్ ఏవీ నర్సింహారావు, లా స్కూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కే.ఎస్.రేఖరాజ్ జైన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంజగుట్ట జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

పంజగుట్ట: పంజగుట్ట కూడలిలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎట్టకేలకు ప్రభుత్వం అంగీకరించింది. కొన్నేళ్లుగా ఇక్కడ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని దళిత, బీసీ సంఘాల నాయకులు పోరాటాలు చేస్తున్నారు. విగ్రహం తీసుకువచ్చి పెట్టగా అనుమతి లేదంటూ దానిని అధికారులు తరలించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు దారితీసింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చొరవతో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు మంత్రి కేటీఆర్ లైన్ క్లియర్ చేశారు. శనివారం విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ.. అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14న 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ అనంతరం మంత్రి కేటీఆర్ చేతులమీదుగా పంజగుట్ట కూడలిలో కూడా ఆవిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు మోహన్ రెడ్డి, చైతన్య, భార్గవ్ నారాయణ, నాయకులు అహ్మద్, కె.నాగేశ్వర్ రావు, మెట్టు రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి

శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి



సిల్వర్ జూబ్లీ పుస్తకావిష్కరణ

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు ఎంత ఎదిగినా ఒదిగి ఉన్నప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామిజీ అన్నారు. అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీ విద్యా సంస్థల్లో 25వ వార్షికోత్సవాన్ని శనివారం జేబీ గ్రూప్ విద్యా సంస్థల కార్యదర్శి జె.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి చిన్న జీయర్ స్వామీజితో పాటు పద్మశ్రీ అవార్డు గ్రహీత, సీవైఐఈఎస్‌టీ ఫౌండర్, చైర్మన్ ఆఫ్ బోర్డు మెంబర్ డాక్టర్ బి.వి.ఆర్.మోహన్‌రెడ్డి, తెలంగాణ టీఏఎఫ్ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ ఎ.గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమ శిక్షణతో అనుకున్న లక్ష్యాలను ఎంచుకొని పట్టుసాధించాలని అన్నారు. సమస్యలు వచ్చినప్పుడు వెంటనే పరిష్కరించుకుంటే భవిష్యత్తుకు మంచి మార్గం ఉంటుందన్నారు. విద్యా సంస్థల కార్యదర్శి జె.వి.కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే జేబీ గ్రూప్ విద్యా సంస్థల లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వంశీధర్‌రావు, డాక్టర్ బి.దీపిక, ఆయా కళాశాలల డీన్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోషణ పక్వాడ్‌లో భాగంగా బహుమతులు అందుకున్న చిన్నారులు

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి మోతి

ఇబ్రహీంపట్నం రూరల్: చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని స్త్రీ శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి మోతి అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఎల్మినేడులో శనివారం కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మోతి మాట్లాడుతూ.. బాలింతలు, కిషోర బాలికలు, గర్భిణుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవడం చాలా మంచిదన్నారు. ఇప్పటికే అనేక మంది రక్తహీనతతో బాధపడుతున్నారని అలా కాకుండా వారికి సరైన పోషక పదార్థాలు అందిస్తే పుష్టిగా తయారవుతారని చెప్పారు. చిన్నారులు బరువు తక్కువగా ఉంటున్నారని, వారికి ఆకుకూరలు, ఐరన్ ఇచ్చే పదార్థాలు అందించాలన్నారు. ఆరేళ్లలోపు పిల్లల్లో శుభ్రత, ఆరోగ్యకరమైన బరువు ఉండాలంటే తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకురావాలని, ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎద్మా అశోకవర్ధన్‌రెడ్డి, జాయింట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ గిరిజ, రాష్ట్ర అధికారి జయరాజ్, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, మెడికల్ అధికారి డాక్టర్ నాగయ్య, డాక్టర్ సంతోష, సీడీపీఓ శాంతిశ్రీ, అజీమ్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను సాధించాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి



సమావేశంలో మాట్లాడుతున్న చావా రవి

షాద్‌నగర్‌రూరల్: యువత దేశంకోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరుల ఆశయ సాధనలో పయనించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో టీఎస్‌యూటీఎఫ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అమరుల త్యాగాలు-ఆచరణలో నేటి తరం అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా చావా రవి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో మాతృదేశ దాస్యశృంఖలాలను తెంచడానికి ప్రాణాలను లెక్క చేయకుండా చిరునవ్వుతో ఉరికంబమెక్కిన చరిత్ర షహీద్ భగత్‌సింగ్, అప్పారి వెంకటస్వామిదని అన్నారు. ప్రస్తుతం దోపిడీదారులు ప్రజలను వారికి తెలియకుండానే దోచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి యువతరం పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, కార్యదర్శులు వెంకటయ్య, నర్సింలు, శ్యామలాదేవి, రఘుపాల్, నాయకులు కృష్ణయ్య, వెంకటరమణ, సత్యం, శేఖర్‌గౌడ్, కృష్ణ, సమత, అరుణ, లక్ష్మీదేవమ్మ, సునీత, బాలయ్య, జనార్దన్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను దోచేస్తున్నారు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

ఇబ్రహీంపట్నం: దేశ సంపదను బీజేపీ ప్రభుత్వం దోచుకొని దాచుకుంటోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య విమర్శించారు. నియోజకవర్గ సీపీఐ విస్తృతస్థాయి సమావేశాన్ని శనివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బహుళ జాతి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తుందని మండిపడ్డారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందన్నారు. పెట్రో, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందన్నారు. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తామని, నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి బీఆర్ఎస్ మోసం చేసిందన్నారు. ధరణితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అన్యాక్రాంతమైన భూదాన్, అసైన్‌మెంట్, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజా సమస్యలపై జీపు, బైకు, బస్సు యాత్రలను చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కావాలి నర్సింహ, రవీంద్రచారి, ఓరుగంటి యాదయ్య, పర్వతాలు, యాదగిరిరెడ్డి, రాజిరెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పి.నీలమ్మ, అలీమొద్దీన్, యాదయ్య, రాజునాయక్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


వెంకటేశ్ (ఫైల్)

మీర్‌పేట: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లెనిన్‌నగర్ హడాక్వార్టర్స్‌కు చెందిన సంపంగి వెంకటేశ్ (50) రోజువారి కూలీ. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వచ్చి మీర్‌పేట పెద్ద చెరువు వైపు వెళ్లిన వెంకటేశ్ తిరిగి రాలేదు. ఆచూకీ కోసం బంధువులు, పరిసర ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సోదరుడు భీమయ్య శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంకటేష్ పెద్ద చెరువులోకి దూకినట్లు స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహం కోసం చెరువు వద్ద గాలింపు చేపట్టారు.

ఓయూలో కొనసాగిన ఉద్రిక్తత

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఓయూలో రెండో రోజు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శనివారం వర్సిటీలలో వివిధ విద్యార్థి సంఘాలు, జేఏసీల ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీలు, నిరసనలు చేపట్టారు. ఓయూ జేఏసీ నేతలు పుల్లారావుయాదవ్, రాస వెంకట ముదిరాజ్, రుద్రవరం లింగస్వామి, దరువు ఎల్లన్న, నెహ్రూనాయక్, మేడి రమణ, పూసల రమేష్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ బీజేపీ ధర్నాలో పాల్గొనేందుకు బైక్ ర్యాలీగా వెళ్లారు. టీఎస్ జేఏసీ అధ్యక్షులు భట్టు శ్రీహరినాయక్, అధ్యక్షులు తుము నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మంత్రి పీఏ తిరుపతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఆర్ట్స్ కాలేజీ నుంచి ర్యాలీ చేపట్టగా పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు.


ఓయూలో ఏబీవీపీ విద్యార్థుల ర్యాలీ

ఏబీవీపీ రాష్ట్రనాయకులు జీవన్ ఆధ్వర్యంలో ఓయూ నుంచి టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న నిరుద్యోగులను, విద్యార్థులను ఎన్‌సీసీ గేటు వద్ద అడ్డుకున్నారు. ఆగ్రహించిన విద్యార్థులు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు.

కబళించిన కరెంట్ తీగ

- విద్యుదాఘాతంతో రైతు మృతి


బాలరాజు మృతదేహం

కొత్తూరు: పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన రైతు బాలరాజు(45) రోజు మాదిరిగానే ఉదయం తన పొలానికి బయలుదేరాడు. బోరుమోటార్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్‌తీగకు తాకడంతో విద్యుత్‌షాక్‌గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన పక్కపొలం రైతు ఫోన్‌లో మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి


లాలూ మృతదేహం

మీర్‌పేట: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ తిరుపతయ్య కథనం ప్రకారం కడ్తాల్ వేములకొండ తండాకు చెందిన నేనావత్ లాలూ (22) పదేళ్లుగా లెనిన్‌నగర్ ప్రాంతంలో నివాసముంటూ స్థానికంగా ఉండే సెంట్రింగ్ మేస్త్రీ నర్సింహ వద్ద కొంత కాలంగా పనిచేస్తున్నాడు. తండ్రి చనిపోగా, తల్లి, ముగ్గురు సోదరులు ఉన్నారు. తల్లి సొంత గ్రామంలో ఉంటుండగా, సోదరులు పహాడీషరీఫ్ షాహిన్‌నగర్‌లో ఉంటున్నారు. మద్యానికి బానిసైన లాలూ పనిచేయగా వచ్చిన డబ్బులతో మద్యం సేవించేవాడు. శనివారం ఉదయం బాలాపూర్ చౌరస్తాలో మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. వడదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

ప్రేమ విఫలమైందని..

- యువకుడి బలవన్మరణం

షాబాద్: ప్రేమ విఫలమైందని మనస్తాపానికి గురైన ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలారం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. షాబాద్ మండలం పోలారం గ్రామానికి చెందిన పట్నం దిలీప్‌కుమార్(23) చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందడంతో ఒంటరిగానే ఉంటున్నాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ శనివారం గ్రామ సమీపంలోని చెట్టుకు డ్రిప్ పైపులతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వివరాలు సేకరించారు. మృతికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉందన్నారు. అయితే స్థానికులు చెబుతున్న దాని ప్రకారం యువకుడికి ప్రేమ విఫలం కారణంగానే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానిస్తున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ గురువయ్యగౌడ్ చెప్పారు.


యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు